సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



పదిలో మెరుగైన ఫలితాలు

పదో తరగతి పరీక్షల్లో ఈ దఫా మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని డీఈఓ గంగాభవాని తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. -8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.58,860
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,257
3 శాతం జీఎస్టీతో	రూ.5,415
నవర (8 గ్రా)	రూ.43,320

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.5 /22.6

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. అప్పుడే ఉక్కపోత ప్రారంభమైంది. బుధవారం వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ 74 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఆరు లేన్ల రహదారిగా విస్తరించండి

• కేంద్ర మంత్రికి వేమిరెడ్డి లేఖ



నెల్లూరు (సెంట్రల్): జాతీయ రహదారి–16ను కోవూరు నుంచి నెల్లూరు వరకు అయినా నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్ల రోడ్డుగా విస్తరణ చేయాలని కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి లేఖ రాశారు. స్పందించిన గడ్కరీ జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించే ప్రక్రియ ప్రతిపాదన పరిశీలించేందుకు డీపీఆర్ కన్సల్టెంట్‌ను నియమించే విషయం ఎన్‌హెచ్‌ఏఐ పరిశీలనలో ఉందని సమాధానమిచ్చారు. కోవూరు నుంచి నెల్లూరునగర పరిధిలో ఉన్న గొలగమూడి జంక్షన్, టీ జంక్షన్, సుందరయ్య కాలనీ ప్రాంతాలను బ్లాక్‌స్పాట్స్‌గా గుర్తించారని, వీటిని సరిదిద్దడానికి గతేడాది నవంబరులో ఈపీసీ మోడ్‌లో ఇవ్వబడిందని సమాధానమిచ్చారు.

నేటి నుంచి మైనింగ్‌శాఖ విభజన

నెల్లూరు (సెంట్రల్): జిల్లా మైనింగ్‌శాఖ విభజన బుధవారం నుంచి అమల్లోకి రానుంది. ప్రస్తుతం జిల్లాకు మైనింగ్ అడిషనల్ డైరెక్టర్ (ఏడీ), డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) ఉన్నారు. ఏడీ కార్యాలయాన్ని తిరుపతి జిల్లా గూడూరుకు మార్చారు. దీంతో నెల్లూరులో ఉన్న మైనింగ్ డీడీ కార్యాలయాన్ని జిల్లా మైనింగ్‌శాఖ అధికారిగా పేరు మార్చారు. ఇప్పటి వరకు ఉన్న డీడీ సూర్యచంద్రరావు జిల్లా మైనింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. పూర్తిస్థాయిలో రికార్డులు తరలించేందుకు కొంత సమయం పడుతుందన్నారు. అప్పటి వరకు అయ్యప్పగుడి వద్ద ఉన్న ఆటోనగర్ ప్రాంతంలో ఉన్న మైనింగ్ కార్యాలయం నుంచే విధులు నిర్వహించనున్నారు.

సోమశిలలో 64.938 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 64.938 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతం నుంచి 1,028 క్యూసెక్కుల నీరు వస్తోంది. జలాశయం నుంచి పెన్నార్‌డెల్టాకు 1,920 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 730, దక్షిణకాలువకు 320, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. సగటున 331 క్యూసెక్కులు ఆవిరవుతోంది.

ఫ్.. క్యాట్‌ఫిష్



చేపల చెరువుల్లో కనిపిస్తున్న కోళ్ల వ్యర్థాలు

• జిల్లాలో విచ్చలవిడిగా నిషేధిత చేపల సాగు
• పెన్నా పరీవాహక మండలాల్లో పెంపకం
• వాటికి మేతగా కుళ్లిన కోళ్ల వ్యర్థాలు
• తమిళనాడు, చిత్తూరు, కర్ణాటక నుంచి దిగుమతి
• బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ హోటళ్లకు క్యాట్‌ఫిష్ ఎగుమతి
• తెలిసినా పట్టించుకోని అధికారులు

కొందరి స్వార్థం సమాజానికి హానికరంగా మారుతోంది. జిల్లాలో యథేచ్ఛగా నిషేధిత క్యాట్‌ఫిష్ సాగుతోంది. పొలాల మధ్య చేపల గుంతలు, రొయ్యల గుంతల పేరుతో విస్తారంగా పెంచుతున్నారు. ప్రధానంగా తీరప్రాంత గ్రామాలతో పాటు బుచ్చిరెడ్డిపాళెం, కోవూరు, విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, సంగం తదితర ప్రాంతాల్లో విస్తృతంగా చేపల పెంపకం చేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు గడించాలన్న దురాశతో నిషేధిత చేపలు పెంపకం చేస్తూ వాటికి మేతగా కుళ్లిన కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తున్నారు. క్యాట్‌ఫిష్ తిన్న ప్రజలు అనారోగ్యానికి గురవుతుండడంతో పాటు, చేపల గుంతల్లో కోళ్ల వ్యర్థాలను వేయడంతో భూగర్భ జలాలు కలుషితమై పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో వ్యవసాయం తర్వాత ఆక్వా, చేపల సాగు భారీ స్థాయిలో జరుగుతోంది. 28 వేల ఎకరాల్లో రొయ్యల సాగు, 8 వేల ఎకరాల్లో చేపల పెంపకం చేస్తున్నారు. చేపల పెంపకం మాటున నిషేధిత క్యాట్‌ఫిష్ సాగు చేస్తున్నారు. ఆదాయమే పరమావధిగా కొందరు వాటికి ఆహారంగా కుళ్లిన కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తున్నారు. క్యాట్‌ఫిష్ తక్కువ కాలంలో అధికంగా బరువు పెరుగుతోంది. జిల్లాలోని పెన్నా పరీవాహక ప్రాంతం కోవూరు నియోజకవర్గంలోని కోవూరు, ఇనమడుగు, దామరమడుగు, బుచ్చిరెడ్డిపాళెం, పెనుబల్లి ప్రాంతాల్లో దాదాపు 1,500 ఎకరాల్లో చేపల సాగు పేరుతో క్యాట్‌ఫిష్ పెంపకం చేస్తున్నట్లు సమాచారం.

కొర్రమీను పేరుతో క్యాట్‌ఫిష్

క్యాట్‌ఫిష్ కొర్రమీనులను పోలి ఉంటాయి. క్యాట్‌ఫిష్‌కు ఉండే మీసాలు తీసేస్తే అచ్చం కొర్రమీనే అనుకుంటారు. కొందరు అక్రమార్కులు క్యాట్‌ఫిష్ పెంపకాలు చేస్తూ దొడ్డిదారిన జిల్లాతో పాటు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. హైదరాబాద్, తమిళనాడుతో పాటు నెల్లూరులోని పెద్ద హోటళ్లలో సైతం కొర్రమీను పేరుతో క్యాట్‌ఫిష్‌ను వడ్డిస్తున్నారు. కొర్రమీను అయితే కిలో రూ.700 నుంచి రూ.1000 వరకు ఉంటుంది. అదే క్యాట్‌ఫిష్ కిలో రూ.100కే దొరుకుతోంది. దీంతో హోటళ్ల యజమానులకు కాసులు కురిపిస్తున్నాయి. వీటిని తినడం వల్ల నాడీ సంబంధిత వ్యాధులు, మతిమరుపు వంటి సమస్యలు వస్తున్నాయి. వివిధ రకాల కేన్సర్‌లు వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్లు చెబుతున్నారు.



డ్రమ్ముల్లో తరలిస్తున్న క్యాట్‌ఫిష్

పర్యావరణానికి ముప్పు

క్యాట్‌ఫిష్‌కు ఆహారంగా మూడు, నాలుగు రోజులు నిల్వ ఉంచిన కోళ్ల వ్యర్థాలను వాహనంలో తరలించే క్రమంలో వాయుకాలుష్యం కూడా వెదజల్లుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కోళ్ల వ్యర్థాలు వాడితే గరిష్టంగా రూ.50 వేలు వరకు జరిమానా విధించే అధికారం మత్స్యశాఖ అధికారులకు ఉంది. రెండోసారి పునరావృతం చేస్తే సాగుదారుల లైసెన్స్ రద్దు చేసి సరుకు స్వాధీనం చేసుకుంటారు. క్యాట్‌ఫిష్ గుంతల్లో వేసే వ్యర్థాల వల్ల పక్కన పంటలు పండించే రైతులు దుర్గంధాన్ని భరించలేక నరకయాతన పడుతున్నారు. పక్క పొలాల్లోని నీటిలోకి కుళ్లిన వ్యర్థాలు చేరిపోయి పంటలు సరిగా పండటం లేదు. పైగా భూగర్భ జలాలు కలుషితమైపోతున్నాయి. దుర్గంధ వాతావరణంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది.

అధికారులకు తెలిసినా..

జిల్లాలో నిషేధిత క్యాట్‌ఫిష్ సాగు చేస్తున్నారని, కోళ్ల వ్యర్థాలు వినియోగిస్తున్నట్లు తరచూ పోలీసు దాడులు ద్వారా తెలిసినా మత్స్యశాఖ మౌనంగా వ్యవహరిస్తోంది. కోవూరు ప్రాంతంలో క్యాట్‌ఫిష్ సాగు జరుగుతున్నట్లు పక్కా సమాచారం ఉన్నా వారు తెలియనట్లు నటిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. క్యాట్‌ఫిష్ సాగుదారులు అధికారులకు మామూళ్లు సమర్పించుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు.

ఖర్చు తక్కువ.. రెండు రెట్లు బరువు

చేపలకు ఆహారంగా తవుడు, సోయాబీన్ తదితర వాటితో ఉత్పత్తి చేసిన మేతను వాడతారు. ఇది కిలో ధర రూ.28 నుంచి రూ.30 వరకు మధ్య ఉంటుంది. ఈ మేత ద్వారా కిలో చేపను పెంచడానికి సుమారు రూ.55 వెచ్చించాల్సి ఉంటుంది. అదే కోళ్ల వ్యర్థాలు కిలో రూ.8 నుంచి రూ.10 వంతున దొరుకుతోంది. దీంతో కేజీ చేపను పెంచడానికి రూ.25 ఖర్చవుతుంది. దీంతో కోళ్ల వ్యర్థాలనే వాడుతున్నారు. ముఖ్యంగా క్యాట్‌ఫిష్‌లకు ఇదే ఆహారంగా వినియోగిస్తున్నారు. క్యాట్‌ఫిష్ అయితే కేవలం ఆరు నెలల్లోనే 15 కిలోలకు పైగా అసాధారణ బరువు పెరుగుతుంది. చేపలు సాధారణంగా నెలకు వంద గ్రాముల చొప్పున బరువు పెరుగుతాయి. కోళ్ల వ్యర్థాలు తినడం వల్ల రెండింతల బరువు పెరుగుతున్నాయి. సాధారణ మేత వల్ల అధిక ఖర్చులు ఉండడంతో కోళ్ల వ్యర్థాలను వేసి ఖర్చులు తగ్గించుకుంటున్నారు. జిల్లాలో దొరికే కోళ్ల వ్యర్థాలతో పాటు చిత్తూరు, తిరుపతి, చెన్నై, బెంగళూరు ప్రాంతాల నుంచి వ్యర్థాలు అతి తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఆటోలు, లారీల ద్వారా చేపల గుంతల వద్దకు తరలించి మేతగా వేస్తున్నారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నింపి వ్యర్థాలను తరలిస్తున్నారు. 2016లో రాష్ట్ర ప్రభుత్వం కోళ్ల వ్యర్థాలను చేపల చెరువులకు మేతగా వేయడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయినా కొందరు చాటుమాటుగా చేపలకు కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారు.



ప్లాస్టిక్ డ్రమ్ముల్లో తెచ్చిన కోళ్ల వ్యర్థాలు

> **ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**
>
> క్యాట్‌ఫిష్ సాగు చేస్తున్నట్లు మా దృష్టికి తీసుకొస్తే తప్పక చర్యలు తీసుకుంటాం. చేపల పెంపకానికి కోళ్ల వ్యర్థాలు వాడకూడదనే ఆదేశాలున్నాయి. అలాంటివి జరుగుతున్నట్లు తమ దృష్టికి తెస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటాం.
>
> – నాగేశ్వరరావు, జేడీ, మత్స్యశాఖ

నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

• డ్వామా పీడీ వెంకట్రావ్

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పనులకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో వెనుకబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ వెంకట్రావ్ మండల సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల ఏపీఓలు, ఈసీలు, టీఏలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. జాబ్‌కార్డులు కలిగిన కూలీలందరూ ఉపాధి పనులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. రోజుకు 60 వేల మంది కూలీలు పనులకు హాజరయ్యేలాచర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనులకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని వంద శాతం సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆధార్ అనుసంధానం వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల వివరాలను క్షేత్ర స్థాయి నుంచి అప్‌లోడ్ చేయాలన్నారు. సిబ్బంది నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను వేగవంతం చేయాలని తెలిపారు.

పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి జేడీగా రమేష్

నెల్లూరు (సెంట్రల్): పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్‌గా కావలి డిప్యూటీ డైరెక్టర్ రమేష్‌నాయక్‌ను నియమించారు. జేడీగా ఉన్న మహేంద్రుడు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఈ నెల 19వ తేదీ వరకు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఆ తర్వాత జేడీ సెలవులో కొనసాగితే మరికొన్ని రోజులు రమేష్ ఇన్‌చార్జిగానే ఉండే అవకాశం ఉంది.

జింకను వధించిన నిందితులకు రిమాండ్

ఆత్మకూరు: మండలంలోని పమిడిపాడు సమీపంలో జింకను వధించిన కేసులో నిందితులకు మంగళవారం కోర్టు రిమాండ్ విధించింది. అటవీశాఖ రేంజర్ కే రామకొండారెడ్డి సమాచారం మేరకు.. పమిడిపాడు గిరిజనకాలనీ వద్ద నివసిస్తున్న కృష్ణ, అంకయ్యలు ఉచ్చులు వేసి జింకలను వేటాడుతున్నారు. రెండు రోజుల క్రితం ఓ జింక వారి ఉచ్చులకు చిక్కింది. దీంతో వారు దాన్ని వధించి వండుకుని తిన్నారు. కాలనీకి చెందిన కొందరు ఆలస్యంగా సమాచారం అందించడంతో తమ సిబ్బంది విచారణ చేపట్టారు. ప్రాథమిక ఆధారాలతో నిందితులు కృష్ణ, అంకయ్యను అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ మేరకు న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు రేంజర్ వివరించారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలో మారుమూల గ్రామాలు సైతం సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇస్కపాళెంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నాయని, గ్రామంలో పరిష్కారానికి నోచుకోని సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని స్థానికులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. జగనన్న పాలనలో అందరికీ మేలు చేకూరే పథకాలను అమలు చేస్తున్నారని సంతోషంగా ఉన్నామని మంత్రి కాకాణికి ప్రజలు తెలియజేశారు. అనంతరం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని విధంగా 95 శాతం ఎన్నికల వాగ్దానాలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని తెలియజేశారు. చంద్రబాబు ప్రజలను మోసం చేస్తే.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలు కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందని గగ్గోలు పెడుతున్న చంద్రబాబు తాను అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను కొనసాగిస్తానని రెండు నాల్కల ధోరణితో మాట్లాడుతున్నాడని విమర్శించారు. పేదరికమే ప్రామాణికంగా తీసుకుని పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తుండడంతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు.



ఇస్కపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలను మహిళకు వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సర్వేపల్లిలో చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి

సర్వేపల్లి నియోజకవర్గం ఏర్పడిన తర్వాత ఎన్నడూ జరగని అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేసిందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గుర్తు చేశారు. సర్వేపల్లిలో అభివృద్ధి జరగడం లేదని విమర్శలు చేసే వ్యక్తులు, అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నిస్తే తోకముడిచి వెళ్లిపోతున్నారని చెప్పారు. వెంకటాచలం మండలంలోనే రూ.120 కోట్లతో సీసీరోడ్లు, డ్రైన్లు, తాగునీటి పథకాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇస్కపాళెంలో రూ.2.60 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని వివరించారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు చేస్తుండడంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఏ గ్రామానికి వెళ్లిన ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య, ఎంపీటీసీ సభ్యులు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, శివకుమార్ రెడ్డి, సర్పంచ్ అడపాల ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు పెళ్లూరు సుధాకర్‌రెడ్డి, కిషోర్ రెడ్డి, చరణ్‌రెడ్డి , కట్టంరెడ్డి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పనే లక్ష్యం

• నేటి నుంచి 124 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
• రీసర్వేతో భూ సమస్యలు పరిష్కారం
• నాడు–నేడులో జిల్లాకు ప్రథమ స్థానం
• జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



నెల్లూరు (అర్బన్): జిల్లాలో వరి కోతలు ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం నుంచి 124 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడా రు. వరి కోతలు ముమ్మరంగా జరిగే నాటికి మరిన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం పండించిన రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. రైతు పండించిన ధాన్యానికి ప్రస్తుతం బయట మార్కెట్‌లో మంచి రేటు ఉందన్నారు. దీంతో రైతులు ప్రస్తుతం బయట అమ్ముకుంటున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా మిల్లర్లకు ధాన్యాన్ని తోలినప్పుడు కూడా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు ఏ–గ్రేడ్ రకానికి రూ.2,060, కామన్ రకానికి రూ.2,040 వంతున అందిస్తామన్నారు. జిల్లాలో 4.5 లక్షల ఎకరాల్లో రైతులు వరిని పండిస్తున్నారన్నారు. ప్రతి రైతుకు మద్దతు ధర లభించేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో సాగుకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఈ–క్రాప్ బుకింగ్ పూర్తి చేశామన్నారు. జిల్లాలోని మనుబోలు, వెంకటాచలం, నెల్లూరు, బోగోలు, అల్లూరు, విడవలూరు తదితర 7 మండలాల్లో చెరువు శిఖరం భూములు, దొరువులు, ప్రభుత్వ నీటి వనరుల్లో సాగు చేసే భూములకు ఈ–క్రాప్ నమోదు చేయడానికి వీలు పడదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జేసీ వెల్లడించారు. సరిపడిన గన్నీ బ్యాగులున్నాయన్నారు. తేమ శాతం మెషిన్లు కూడా దండిగా ఉన్నాయన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు చెక్

ప్రభుత్వం 100 ఏళ్ల తర్వాత ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వే చేపట్టిందన్నారు. దీని వల్ల అన్ని రకాల భూ సమస్యలకు చెక్ పెట్ట వచ్చన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 118 గ్రామాల్లో భూసర్వే పూర్తి చేసి రైతులకు అందుకు సంబంధించిన పుస్తకాలు అందించామన్నారు. దీంతో ఆయా గ్రామాల నుంచి ఇప్పటి వరకు భూ సమస్యలకు సంబంధించి ఒక్క ఫిర్యాదు కూడా రాలేదన్నారు. మిగతా గ్రామాల్లో సైతం భూ సర్వే జరుగుతుందన్నారు. సర్వేను పక్కాగా ఎలాంటి లోపాలు లేకుండా రైతుల సమక్షంలో చేస్తున్నామన్నారు. రీ సర్వేలో కొంత మంది ప్రభుత్వం ఇచ్చిన అసైన్‌మెంట్ పట్టాలను రైతుకు సంబంధించిన సెటిల్‌మెంట్ పట్టాలుగా చూపాలని కోరుతున్నారన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ భూములుగానే చూపుతామన్నారు. ఆ భూములు ఎవరి సాగుబడిలో ఉంటే వారివిగానే ఉంచుతామన్నారు.

నాడు–నేడులో జిల్లాకు ప్రథమ స్థానం

జిల్లాలో నాడు–నేడు రెండో దశ కింద 1,363 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ పనులు వేగంగా పారదర్శకంగా పూర్తి చేస్తున్నామన్నారు. ఇప్పటికే రూ.97 కోట్ల విలువైన పనులు చేయగా రూ.87 కోట్ల బిల్లులు సైతం చెల్లించామన్నారు. నాడు–నేడు పనుల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కార్పొరేటర్లు ఇలా జిల్లాలో 763 మంది ఓటర్లున్నారన్నారు. తాను రిటర్నింగ్ అధికారిగా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 3,03,969 మంది ఓటర్లున్నారని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 7,713 మంది ఓటర్లున్నారన్నారు. కలెక్టర్ చక్రధర్‌బాబు సారథ్యంలో ఎన్నికలను పక్కాగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు.

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు

• కలెక్టర్ చక్రధర్‌బాబు

నెల్లూరు (అర్బన్): జిల్లాలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ చక్రధర్‌బాబు ఎన్నికల నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ప్రతి ఎన్నికలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు ఎంతో కృషి చేశారన్నారు. అదే స్ఫూర్తితో ఇప్పుడు కూడా పని చేయాలన్నారు. శాంతిభద్రతలు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, పోలింగ్ మెటీరియల్, బ్యాలెట్ పేపర్లు, బాక్సు ల నిర్వహణ, ఖర్చుల వివరాలు, స్ట్రాంగ్ రూంల ఏర్పాటు, మైక్రోఅబ్జర్వర్ల నియామకం తదితర అంశాలకు సంబంధించి నోడల్ అధికారులు నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 129 పోలింగ్ స్టేషన్లు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు 40 పోలింగ్ స్టేషన్లు ఏర్పా టు చేస్తున్నామన్నారు. ఇప్పటి నుంచే పోలింగ్ కేంద్రాల్లో తగిన వసతులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ రోణంకి కూర్మనాథ్, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ హరిత, కందుకూరు సబ్‌కలెక్టర్ శోభిక, సెబ్ జిల్లా అధికారి శ్రీలక్ష్మి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, నుడా వీసీ బాపిరెడ్డి, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, కరుణకుమారి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డ్వామా పీడీ వెంకటరావు, మైనార్టీ వెల్ఫేర్ అధికారి కనకదుర్గాభవాని, ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు

కోడ్ అమలుకు అధికారుల నియామకం

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను అమలు చేసేందుకు, అభ్యర్థుల, రాజకీయ పార్టీల ఖర్చులు ఇతర వివరాలను పరిశీలించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ 39 మండలాల్లో పనిచేస్తున్న ఎంపీడీఓలను అదే మండల ఎన్నికల కోడ్ అమలు అధికారులుగా నియమించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు..

నామినేషన్లు స్క్రూటినీ చేసేందుకు, అభ్యర్థుల విత్‌డ్రా, రోజూ వారీ నివేదిక తదితర అంశాలకు సంబంధించి డీఆర్‌ఓ వెంకటనారాయణమ్మను అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా నియమించారు. నుడా వైస్ చైర్మన్ టి.బాపిరెడ్డిని, కలెక్టరేట్ తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఈ– జిల్లా మేనేజర్ శ్రీరాములును, కంప్యూటర్ ఆపరేటర్ గోవర్ధన్‌ను ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు నియమించారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీతో పీఠాధిపతికి సంబంధం లేదు

- వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు మీరా



మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు సభ్యులు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట దర్గా పీఠాధిపతి హఫీజ్‌పాషాకు వైఎస్సార్‌సీపీతో, డిప్యూటీ సీఎం అంజాద్‌బాషాతో ఎలాంటి సంబంధం లేదని జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు ఎస్కే మీరా అన్నారు. దర్గా ప్రాంగణంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హఫీజ్‌కు అంజాద్‌బాషా సహకారం ఉందని ఎల్లో మీడియాలో వస్తున్న వార్తలు నిజం కాదన్నారు. పీఠాధిపతి తప్పు చేసి ఉంటే ఉపేక్షించేది లేదని, ప్రస్తుతం జరుగుతున్న విషయాలను రాష్ట్ర వక్ఫ్ బోర్డు దృష్టికి సైతం తీసుకెళ్తున్నట్లు తెలిపారు. హఫీజ్‌పాషా వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి కాదని, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆయన ఆ పార్టీలో కొనసాగుతూ పీఠాధిపతిగా బాధ్యతలు తీసుకున్నారన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా దర్గా ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీతో, మంత్రులు, ఎమ్మెల్యేతో హఫీజ్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షౌకత్‌అలీ, జాయింట్ సెక్రటరీ యస్దానీబాషా, సభ్యులు ఎస్కే జిలానీ, ముర్తుజా, హుస్సేన్, సందానీబాషా, షాజహాన్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: ముత్తుకూరు ఈఆర్ఆర్ఎం క్లబ్‌లో మంగళవారం జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. గంటా సాంబశివరావు జ్ఞాపకార్థం ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, ఎస్సై శివకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టోర్నమెంట్ మొదలైంది. అదానీ కృష్ణపట్నం పోర్టు పీఆర్వో గంటా వేణుగోపాలరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ పోటీలు ఆరోగ్యకర వాతావరణంలో జరగాలని ఆకాంక్షించారు. ఈనెల 17వ తేదీ వరకు టోర్నమెంట్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో షేక్ రహీం, సూరి, ముత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

వింజమూరు: మండలంలోని గుండెమడకలలో మంగళవారం పొగాకు బ్యారన్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన చీమల రాముకు చెందిన బ్యారెన్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో అందులో ఉంచిన పొగాకు, టైర్లు, కర్రలు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న వింజమూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.4 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపాడు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 95
లేయర్ (లైవ్)	: 75
బ్రాయిలర్ చికెన్	: 172
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 192
లేయర్ చికెన్	: 128

చోరీలకు చెక్ పెట్టేందుకు..

జిల్లాలో రోజూ ఏదో ఒకచోట చోరీలు జరుగుతున్నాయి. కొందరు పోలీస్ అధికారులు, సిబ్బంది మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఎస్పీ కన్నెర్ర చేశారు. గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. దొంగతనాల నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరుతున్నారు.

- ఇటీవల పెరిగిన దొంగతనాలు
- నిర్లక్ష్యంగా కొందరు పోలీస్ అధికారులు, సిబ్బంది
- పోలీస్ బాస్ ఆదేశాలతో గస్తీ ముమ్మరం
- పాత నేరస్తులపై నిఘా



న్యూ మిలటరీ కాలనీలో వివరాలు తెలుసుకుంటున్న పోలీస్ అధికారులు (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఎంతమంది ఉంటున్నారు.. ఎవరెవరు ఉన్నారు. ఎప్పుడు బయటికి వెళ్తారు?, ఎప్పుడు తిరిగొస్తారు. సీసీ కెమెరాలు ఉన్నాయా? లేదా? ఇలా దొంగలు రెక్కీ నిర్వహిస్తున్నారు. ఇల్లు విడిచి బయటకు వెళ్తే చాలు.. ఇట్టే తలుపులు పగులగొట్టి అందినకాడికి దోచుకెళ్తున్నారు. ఒంటరిగా నివాసం ఉంటున్నవారు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నారు. ఆ సమయంలో ప్రతిఘటిస్తే చంపుతామని బెదిరించి తాళ్లతో కట్టేసి నిలువు దోపిడీ



దోపిడీ జరిగిన ఇంట్లో చిందరవందరగా పడేసిన వస్తువులు (ఫైల్)

చేస్తున్నారు. చిన్నపాటి ఆధారం దొరక్కుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జనసంచారం తక్కువగా ఉన్న వీధుల్లో నడిచి వెళ్తున్న మహిళల మెడల్లోని బంగారు గొలుసులను తెంపుకెళ్తున్నారు. పోలీసులు ఒక కేసులో నిమగ్నమై ఉండగానే మరో ప్రాంతంలో దొంగతనాలకు పాల్పడుతూ సవాల్ విసురుతున్నారు. తాజాగా సోమవారం తెల్లవారుజామున న్యూమిలటరీ కాలనీలో జరిగిన దోపిడీ, మిలటరీ కాలనీలో జరిగిన దొంగతనాలు అందుకు అద్దం పడుతున్నాయి.

పటిష్ట చర్యలు

జిల్లాలో నేరాల కట్టడికి ఎస్పీ సీహెచ్ విజయారావు పటిష్ట చర్యలు చేపట్టారు. విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు. అనుమానాస్పద వ్యక్తులు, పాత నేరస్తుల కదలికలపై నిఘా పెంచారు. సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతోపాటు నేర నియంత్రణకు ఛాయ్ విత్ బీట్స్ కార్యక్రమాన్ని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో అమలులోకి తీసుకొచ్చారు. జైల్‌మానిటరింగ్ వ్యవస్థను పటిష్టం చేశారు. జిల్లా కేంద్రంలో పగలు, రాత్రి గస్తీని పెంచారు. ఫిన్స్ సహాయంతో పాత నేరస్తులను గుర్తిస్తున్నారు. దీంతో కొంతమేర నేరాలు తగ్గుముఖం పట్టాయి. పలువురిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అయితే ఇటీవల కొందరు పోలీస్ అధికారులు, సిబ్బంది మొక్కుబడి విధులకు పరిమితం కావడంతో మళ్లీ నేరాలు జరుగుతున్నాయి.

సమాచారం ఇవ్వాలి

దొంగతనాల నియంత్రణకు పోలీస్ ఉన్నతాధికారులు అనేక చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు వేరే ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే ఆ ఇంటిపై ప్రత్యేక నిఘా పెడతారు. కుదరని పక్షంలో దొంగతనాల నియంత్రణకు పోలీసు శాఖ రూపొందించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సేవలను వినియోగించుకోవాలని పదేపదే అధికారులు చెబుతున్నా కొందరు పెడచెవిన పెడుతున్నారు. దీంతో దొంగతనాలు జరిగేందుకు ఆస్కారమవుతోంది. వరుస దొంగతనాల నేపథ్యంలో పోలీస్ బాస్ కీలక ఆదేశాలిచ్చారు. గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు.

ఇటీవల జరిగిన ఘటనలు



- మనుబోలు బీసీ కాలనీలో మహబూబ్‌బాషా అనే వ్యక్తి ఇంట్లో దొంగలు పడి రూ.60 వేల నగదు, మూడు సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లారు.
- సంగం మండలం జెండాదిబ్బలో షణ్ముగం అనే వ్యక్తి ఇంట్లో రూ.10 వేల నగదు, ఏడుసవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేశారు.
- నెల్లూరు బాలాజీనగర్ లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇంట్లో రూ 2లక్షలు విలువచేసే బంగారు ఆభరణాలు, నగదును అపహరించారు.
- న్యూ మిలటరీ కాలనీలో తండ్రి, కుమార్తెను కట్టేసి పదకొండున్నర సవర్ల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరించుకెళ్లారు.
- మిలటరీ కాలనీలో విశ్రాంత మైన్స్ జేడీ ఇంట్లో దొంగలు పడి బంగారు, నగదు అపహరించారు.
- వైఎస్‌ఆర్ నగర్‌లో ఆదిలక్ష్మి అనే మహిళ ఇంట్లో మూడున్నర సవర్ల బంగారు ఆభరణాల అపహరణ.
- బుచ్చిరెడ్డిపాళెం పెనుబల్లి గ్రామంలో వీరప్రతాప్ అనే వ్యక్తి ఇంట్లో 8 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు అపహరణ.
- కోటమిట్టలో ఒంటరిగా నడిచి వెళ్తున్న మైథిలి అనే మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు తెంపుకెళ్లారు.

గస్తీ ముమ్మరం చేశాం



దొంగతనాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పగలు, రాత్రి గస్తీ పెంచాం. అనుమానాస్పద వ్యక్తులు, పాతనేరస్తుల కదలికలపై నిఘా పెంచాం. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నాం. వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్‌లు ఇళ్లలో వీలైనంత మేర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అందరినీ చైతన్యవంతులను చేస్తున్నాం. ఇల్లు విడిచి బయటకు వెళ్లేవారు విలువైన వస్తువులు ఉంచరాదు. విధిగా స్థానిక పోలీసుస్టేషన్‌లో సమాచారం అందిస్తే ఇంటిపై నిఘా పెడతాం. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక శక్తుల కదలికలను గుర్తిస్తే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.

– డి.శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

ఆ ఎస్‌ఎంఎస్‌లకు స్పందించొద్దు

- విద్యుత్ బిల్లు కట్టాలంటూ సైబర్ నేరగాళ్ల వల
- లింక్‌పై క్లిక్ చేస్తే బ్యాంక్ ఖాతా ఖాళీ అవుతుంది
- వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి
- ఏపీ ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య



నెల్లూరు(వీఆర్సీసెంటర్): 'మీరు వెంటనే విద్యుత్ బిల్లు చెల్లించాలి. లేకపోతే కనెక్షన్ కట్ చేస్తాం. డబ్బు చెల్లించేందుకు ఈ లింక్ క్లిక్ చేయండి.' అంటూ వచ్చే ఎస్‌ఎంఎస్‌లకు స్పందించవద్దని ఏపీ ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ వెంకటసుబ్బయ్య సూచించారు. నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ బిల్లు బకాయి ఉన్నారంటూ సైబర్ నేరగాళ్లు వినియోగదారులకు ఎస్‌ఎంఎస్‌లు పంపి నగదు దోచుకోవడం ఈ మధ్యకాలంలో ఎక్కువైందన్నారు. కొందరు వ్యక్తులు వినియోగదారులకు ఎస్‌ఎంఎస్‌లు పంపుతున్నారన్నారు. అది చూసిన వారు ఆందోళన చెంది సదరు ఫోన్ నంబర్‌కు ఫోన్ చేస్తే విద్యుత్ శాఖ ఉన్నతాధికారినని పరిచయం చేసుకుని నగదు చెల్లింపు పేరిట ఆన్‌లైన్ లింక్‌ను పంపుతున్నట్లు చెప్పారు. లింక్ మీద నొక్కితే బ్యాంక్ ఖాతాలోని నగదు పోతుందన్నారు. ఇటువంటి ఎస్‌ఎంఎస్‌లు రాత్రి సమయాల్లో ఎక్కువగా వస్తున్నాయన్నారు. మోసపూరిత ఎస్‌ఎంఎస్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. బ్యాంకు అకౌంట్ నుంచి నగదు పోయిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండకపోవచ్చన్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ శాఖ, సంబంధిత అధికారుల నుంచి కానీ వినియోగదారులకు ఎలాంటి ఎస్‌ఎంఎస్‌లు పంపటం జరగదన్నారు. సిబ్బంది మీటర్ రీడింగ్ తీసిన సమయంలో ఒకసారి, బిల్లులకు సంబంధించిన నగదు చెల్లించిన సమయంలో మరొకసారి మాత్రమే తమ శాఖ నుంచి మెసేజ్‌లు వస్తాయని స్పష్టం చేశారు. బిల్లు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని తమ శాఖ ఎస్‌ఎంఎస్‌లు పంపదన్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో ప్రజలు జాగ్రత్త వహించాలని సూచించారు.

పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలకు కృషి

- డీఈఓ గంగాభవాని
- గండవరం ఉన్నత పాఠశాల పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ గంగాభవాని

కొడవలూరు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ ఆర్ఎస్ గంగాభవాని సూచించారు. మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆమె పరిశీలించారు. సుమారు రెండు గంటలపాటు అక్కడుండి ప్రతి విషయాన్ని ఆరాతీశారు. బైజూస్ ట్యాబ్‌లను విద్యార్థులు బాగా ఉపయోగిస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలో పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి చెందారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల నోట్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు నోట్స్‌లను చూసి తప్పొప్పులను సరిచేసి సంతకాలు చేయాల్సి ఉంది. అయితే కొన్నిచోట్ల సంతకాలు చేయకపోవడాన్ని ఆమె గుర్తించారు. లోపాలను సవరించుకోవాలని సూచించారు. టీచర్లతో ప్రత్యేకంగా సమావేశమై పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు చేయాల్సిన పనులపై సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ జి.వసంతకుమారి, హెచ్ఎం జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జి.నాగభూషణం, పి.శ్రీనివాసులు, రాజా సుధాకర్‌రావు, పుట్టయ్య, కుసుమకుమారి, మాధవి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మహిళ మృతదేహం

ఆత్మకూరు: పట్టణంలోని మేజర్ చెరువులో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఎస్సై ఎం.శివశంకర్రావు కథనం మేరకు.. చెరువు గట్టు సమీపంలో 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న మహిళ మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. వారి సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆమె చనిపోయి రెండురోజులు దాటి ఉంటుందని భావిస్తున్నారు. దీంతో శరీరం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని విధంగా మారింది. మహిళ ఎరుపు రంగు పూల చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.40
పండ్లు	: రూ.15

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకం అందుకుంటున్న పీడీ మురళి

కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మురళి జాతీయస్థాయి క్రీడల్లో ప్రతిభ చూపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. పశ్చిమ బెంగాల్లోని కోల్‌కతాలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు 42వ జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. 45 సంవత్సరాల విభాగంలో మురళి హ్యామర్‌త్రోలో ద్వితీయ స్థానం, షార్ట్‌పుట్‌లో తృతీయ స్థానంలో నిలిచాడు. పీడీని ప్రధానోపాధ్యాయుడు భీమేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వెంట నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, పృథ్వీరెడ్డి ఉన్నారు. – బుచ్చిరెడ్డిపాళెం